విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న మల్లయ్య

సుభాష్‌నగర్: మన చేతి రాత ద్వారానే పరీక్షల్లో మంచి మార్కులు పొందుతామని జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఫౌండర్ మల్లయ్య అన్నారు. గాజులరామారంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం చేతిరాత శిక్షణ శిబిరాన్ని స్థానిక హెచ్‌ఎం అశోక్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు విద్యార్థులకు ఉచితంగా చేతి రాత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ ఫోన్, టైపింగ్ అలవాటు పడి చేతి రాతపై పట్టు కోల్పోయారని, ఇలాంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా చేతిరాత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు.

షెట్టర్ల అద్దెల కోసం 15న బహిరంగ వేలం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని డబల్ బెడ్ రూమ్ సముదాయంలో షెట్టర్‌ల అద్దె నిమిత్తం ఈ నెల 15న బహిరంగ వేలం పాట వేయనున్నట్లు ప్రెసిడెంట్ వేణు బుధవారం తెలిపారు. ఈ నెల 13 లోగా 30 వేల రూపాయల డీడీని కార్యాలయంలో అందజేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 15న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తహసీల్దార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, హౌసింగ్ ఈఈ సమక్షంలో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9951335597లో సంప్రదించాలని కోరారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌మాదిగ కోరారు. బుధవారం తహసీల్దార్ సూజాతకు ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. నూతన విద్యా సంవత్సరం క్రమంలో రెవెన్యూ కార్యాలయానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు వివిధ సర్టిఫికెట్ల కోసం వస్తారన్నారు. వారికి సకాలంలో ధ్రువపత్రాలను అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ, నర్సింహులు, బీఎస్పీ నాయకురాలు సాబేర బేగం, బీసీ నాయకులు మురళి, వెంకటేష్, రాము కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

నిజాంపేట్: బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న జె.ఉపేందర్ రావు ఈఓడబ్ల్యూకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రాయదుర్గం డీఐగా పని చేస్తున్న సి.సతీష్ కుమార్ బాచుపల్లి పోలీస్‌స్టేసన్‌కు, సూరారం పోలీస్‌స్టేషన్‌లోని ఎస్.భరత్ కుమార్ డీఆర్‌ఎ సీబీకి, మేడ్చల్ డీఐ ఎస్.సుధీర్ క్రిష్ణ సూరారం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాచుపల్లి సీఐగా జె. ఉపేందర్ రావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తనదైన ముద్ర వేసుకున్నారు. క్రైం రేటు తగ్గించడంలో తీవ్రంగా కృషి చేశారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో అందరిని భాగస్వామ్యం చేస్తూ నేరాలు అదుపునకు తనవంతు ప్రయత్నం చేశారు. ఆయా కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేశారు.

దర్గా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న కె.ఎం.ప్రతాప్

చింతల్: డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీలో గౌసె ఆజం దస్తగిరి దర్గా ప్రహరీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్ హాజరై దర్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖాదర్, మహ్మద్ రియాజ్, జలీల్ ఖాన్, గౌస్, రషీద్, షాకీర్, అన్సర్, వాజిద్, షేక్ చాంద్, షేక్ తాజ్, అలీ షేక్ అలీ, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలు చేపట్టి.. పనులు వదిలేసి!

అసంపూర్తిగా సీసీ రోడ్డు పనులు

- ఐదు నెలల క్రితం రూ.60 లక్షల నిధులతో శంకుస్థాపన
- నిలిచిన పనులతో స్థానికులకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అన్న తీరుగా మారింది జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరు. రోడ్ల ఆధునీకరణ కోసం తవ్వకాలు చేపట్టిన కాంట్రాక్టర్ కొంత భాగం పూర్తి చేసి చేతులెత్తేశాడు. అయినా సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకునే నాథుడే లేడు.



రోడ్డును తవ్వి వదిలేయడంతో రాకపోకలకు ఆటంకంగా మారిన ప్రాంతం

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.60 లక్షల నిధులతో భగత్ సింగ్‌నగర్ రెండవ ప్రధాన రోడ్డులో సీసీ రోడ్డు పనులకు ఐదు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 60 శాతం మేర పూర్తి చేసి మరో 40 శాతం రోడ్డు వేయకుండా తవ్వకాలు చేపట్టి పత్తా లేకుండా పోయాడు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాహనాల రాకపోకలు బంద్

సుమారు కుడి, ఎడమలకు కలిపి సుమారు 35 రోడ్లకు పైగా అనుసంధానంగా ఉంటుంది ఈ రోడ్డు. ఇక్కడ సుమారు 40 శాతం మేరా సీసీ రోడ్డు వేయకుండా జేసీబీతో తవ్వకాలు చేపట్టి కాంట్రాక్టర్ పత్తాలేకుండా పోయాడు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వారి తల్లిదండ్రుల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం ఎక్కడో నిలిపివేసి రోగులను తీసుకువెళ్లాల్సిన దుస్థితి ఉంది. కుడి, ఎడమల రోడ్లకు ఈ రోడ్డు అనుసంధానం చేయక మధ్యలోనే వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలు లేదు. పూర్తి చేసిన రోడ్డులో సైతం మట్టి దిబ్బలను ఎక్కడికక్కడ వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి దెబ్బలు అలాగే వదిలేయడంతో చిన్న వర్షానికి నూతన రోడ్డంతా బురదమయంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం



ఐదు నెలలుగా మా బస్తీలో రోడ్డు వేసేందుకు తవ్వి అలాగే వదిలేశారు. కొంత భాగం పూర్తి చేసి, మరి కొంత పూర్తి చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వాహనాలను ఎక్కడో వీధి చివర వదిలేసి రావాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో ఎప్పుడైనా ఇళ్ల ముందుకు ఆటోలను, ఇతర అత్యవసర బండ్లను రోడ్డు చివరన వదిలేసి మోసుకు రావాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

– రాజు, భగత్‌సింగ్‌నగర్



ప్రధాన రోడ్డు పూర్తికాకపోవడంతో ఎత్తులో ఉన్న అంతర్గత రోడ్డు



రోడ్డుపై మట్టి దిబ్బలు వదిలేయడంతో బురదమయంగా మారిన దృశ్యం

సెల్ టవర్ పనులు నిలిపి వేయాలి



కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుండిగల్: ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని నేతలు కోరారు. ఈ మేరకు గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ గ్రామ పరిధి రెండవ వార్డులోని శ్రీనివాస నగర్ వివేకానంద విగ్రహం వద్ద ఓ వ్యక్తి తన ఇంటిపై సెల్ టవర్‌ను ఏర్పాటు చేయిస్తున్నాడని, సెల్ టవర్ రేడియేషన్ కారణంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని వివరించారు. వెంటనే సదరు సెల్ టవర్ పనులను నిలిపి వేయాలని కోరారు. నూతన సెల్ టవర్లకు అనుమతులు ఇవ్వొద్దని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చినంగి వెంకటేశం, ఏ.గోపాల్‌రెడ్డి, పాండుగౌడ్, వి.నరేందర్, మోహన్‌దాస్‌గౌడ్, బిక్షంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షాపులు కోల్పోతున్న వారికి అండగా ఉంటా

మైనంపల్లి హనుమంతరావు



మైనంపల్లి హనుమంతరావుకు సమస్యను వివరిస్తున్న యజమానులు

సుభాష్‌నగర్: దూలపల్లి ప్రధాన రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న వారికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు అన్నారు. రోడ్డు విస్తరణలో షాపులు, భవనాలు కోల్పోతున్న యజమానులు బుధవారం దూలపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ బూరుగుబావి సత్యనారాయణ ఆధ్వర్యంలో మైనంపల్లిని ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించారు. తమ భవనాలు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు ప్రకారం ప్రభుత్వం డబ్బులు చెల్లించేలా చూడాలని ఆయనను కోరారు. దీంతో మైనంపల్లి హనుమంతరావు వెంటనే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు, హెచ్‌ఎండీఏ ప్రధాన అధికారి సర్ఫరాజు, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వీరికి ప్రస్తుత మార్కెట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. దీంతో సంబంధిత అధికారులు స్థానికంగా వచ్చి పరిశీలిస్తామని చెప్పినట్లు వారు తెలిపారు.

బూత్ లెవెల్ అధికారులకు ట్రైనింగ్ క్యాంప్



బూత్ లెవెల్ అధికారులతో ఉప కమిషనర్ నరసింహ, తహసీల్దార్ సుజాత

కుత్బుల్లాపూర్: బూత్ లెవెల్ ఆఫీసర్ల విధులపై అవగాహన కల్పించేందుకు ప్రతిరోజు ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి నరసింహ అన్నారు. ప్రతిరోజు 50 మంది చొప్పున నాలుగు రోజులపాటు కుత్బుల్లాపూర్ మరో నాలుగు రోజులపాటు గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఉన్న బీఎల్‌ఓలకు ఈ కార్యక్రమం ఉంటుందని, తదనంతరం రాష్ట్ర ఎన్నికల అధికారుల సూచన మేరకు ఆయా ప్రాంతాల వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం 50 మంది బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఏఎంసీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెడ్‌గర్ల్, హెడ్‌బాయ్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో బుధవారం పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి పూర్ణిమల ఆధ్వర్యంలో విద్యార్థుల నాయకత్వ ప్రమాణ స్వీకార వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌సీసీ ప్రతిమా రాణి ఘోషల్ ముఖ్య అతిథిగా హాజరై హెడ్‌గర్ల్, హెడ్ బాయ్‌లతో పాటు వివిధ తరగతుల విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థి దశలోనే ఎన్నికల పోటీలు నిర్వహించి వాటి పట్ల అవగాహన కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కోటిరెడ్డి అన్నారు.

శిథిలావస్థలోని నిర్మాణాల కూల్చివేత



కుత్బుల్లాపూర్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని శిథిలావస్థకు చేరుకున్న పలు నిర్మాణాలను కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు గుర్తించి కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ పర్యటన నేపథ్యంలో సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న ఇంటి నిర్మాణాలను గుర్తించి, వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉప కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సురేందర్ రెడ్డి, మధు నేతృత్వంలో సిబ్బంది 9 నిర్మాణాలను గుర్తించి, వాటిలో ఏడు నిర్మాణాలను తొలగించారు. మరో రెండు నిర్మాణాలు రెండు రోజుల్లో తొలగిస్తామని తెలిపారు.

బాచుపల్లిలో 27 నుంచి బోనాలు

నిజాంపేట్: బాచుపల్లి గ్రామంలో ఈ నెల 27న బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు తీర్మానించారు. బుధవారం బాచుపల్లిలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు ఈ మేరకు ఏకాభిప్రాయానికి వచ్చారు. 27న బాచుపల్లి శ్రావణమాస బోనాలతో పాటు, ఆగస్టు 3న రాజీవ్ గాంధీ నగర్, ఇంద్రానగర్ బోనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

- మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్
- బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

కుత్బుల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో జీడిమెట్ల డివిజన్‌కు చెందిన బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అలివేలు ఆధ్వర్యంలో మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సంగీత, శోభ, సుమిత, పార్వతి, వరలక్ష్మి, శిరీష, స్వప్న, కళ్యాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్, బైక్ దొంగిలించిన నిందితుల అరెస్టు

నిజాంపేట్: సెల్‌ఫోన్, బైక్‌ను దొంగిలించిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ టీమ్ బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాచుపల్లి ఎక్స్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. నిందితులు కొత్తవారి సాయి చరణ్ (25), షేక్ యూనుస్ (21) బాచుపల్లిలోని సెల్ ఫోన్లు దొంగతనం చేసినట్లు, మంగళగిరి పీఎస్ పరిధిలో బైక్‌ను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 5 ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఇద్దరిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి, లాలాపేట, మొతిగూడెం, ఆరెండల పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లినట్లు బాచుపల్లి డీఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కుత్బుల్లాపూర్: భర్తతో గొడవపడి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లోని జీనియస్ స్కూల్ సమీపంలో నివాసముండే పరమ్ శ్రీకాంత్, సరిత (38) భార్యాభర్తలు. ఈ నెల 6న డబ్బుల విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సరిత బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు బెడ్‌రూమ్ తలుపులు బద్దలకొట్టి ఆమెను కిందకు దించి సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

రిటైర్డ్ ఆర్మీ మేయర్ విశ్వనాథ్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన విద్యార్థులు

జీడిమెట్ల: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని రిటైర్డ్ ఆర్మీ మేయర్ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎస్‌ఆర్ నాయక్ నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల క్రమశిక్షణా కమిటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మాహిన్‌ఫాతిమా, హెడ్ బాయ్‌గా ఉద్దీష్‌కుమార్, హెడ్‌గర్ల్‌గా ప్రీతి మంజరి, సీసీఏగా సంజన, స్పోర్ట్స్ కెప్టెన్‌గా కార్తీక్‌లకు బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో టీవీఆర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయరాజ్, ఉపాధ్యాయులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దోలారీ ధనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి గోదాములు, వెంకట్‌రెడ్డి గోదాములు, దోలారీధనీ రోడ్డు, హార్లిక్స్ కాలనీ, జీదాబా వెనుక గల్లీ, వైష్ణవి ఎన్‌క్లేవ్, కొంపల్లి గ్రామం, 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్యారడైజ్ హోటల్, రిలయెన్స్ పెట్రోల్ బంక్, ఆర్‌కే హాస్పిటల్, జీబీఆర్ క్లబ్, సాయిసిద్దార్థ ఆసుపత్రి రోడ్డు, ఆరో కన్‌స్ట్రక్షన్స్, హైటెక్ నర్సరీ, సిగరెట్ ఫ్యాక్టరీ, కొంపల్లి గ్రామం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..

11కేవీ భజరింగ్ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భజరంగ్ హిల్స్, బౌద్ధనగర్, వాసవీ స్క్వేర్, సరోత్తం ఇండస్ట్రీ ఏరియా, వేంకటేశ్వర కాలనీ, సుచిత్ర చౌరస్తా, 11కేవీ పైపులైన్ రోడ్డు ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పైపులైన్ రోడ్డు ఏరియా, జీడిమెట్ల ఎస్సీ కాలనీ, ఆర్‌వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, శ్వేత ఆర్యన్, సీఎంఆర్ స్కూల్ లేన్‌లలో సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలింగ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో లెజెండ్ రెసిడెన్సి ఏహెచ్ ప్యాకింగ్, ఆర్‌ఆర్ టౌన్‌షిప్, నాగిరెడ్డి కాలనీ, వల్లభ నగర్, పోచమ్మ టెంపుల్, మల్లికార్జున కాలనీ, పీవీ ఎన్‌క్లేవ్, శ్రీసత్య రెసిడెన్సీ, చిన్నతోకట సబ్‌స్టేషన్ పరిధి పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్, ఫరీద్ నగర్ , మనోవికాస్ నగర్, రిలయన్స్ విల్లా మార్ట్, రాయల్ ఎన్‌క్లేవ్, ఎస్‌బీఐ కాలనీ, అరవల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని ఏడీఈ శ్రీకాంత్ కోరారు.

కదం తొక్కిన కార్మికులు

- కార్మికులకు నష్టం చేసే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు

కుత్బుల్లాపూర్: సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో జరిగిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. షాపూర్‌నగర్ చౌరస్తా, గండిమైసమ్మ, బాలానగర్ చౌరస్తా, ప్రగతిగనర్, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పారిశ్రామికవాడ, గాంధీనగర్ పారిశ్రామిక వాడల్లో ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాల వ్యతిరేకంగా నినదించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలను కల్పించడంతో పాటు నల్ల చట్టాలను తొలగించాలని డిమాండ్ చేశారు.



గండిమైసమ్మ చౌరస్తాలో భారీ ర్యాలీలో పాల్గొన్న కార్మికులు



జగద్గిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



షాపూర్‌నగర్ చౌరస్తాలో ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ, డీవైఎఫ్ఐ నాయకులు



బాలానగర్ చౌరస్తాలో ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు